జిందగీ
చదువు
నమస్తే తెలంగాణ హైదరాబాద్
సోమవారం 1 జూలై 2024
www.ntnews.com

సర్వం జగన్నాథం

ఈ నెల 7న పూరీ రథయాత్ర

ఆషాఢంలో సర్వం జగన్నాథం! ఆషాఢ శుద్ధ విదియ మొదలు ఏకాదశి వరకు పూరీ క్షేత్రంలో ప్రతి రోజూ పండుగే. కడలి ఉప్పొంగుతుంది. అలలు కొత్త కళను సంతరించుకుంటాయి. పూరీ కేంద్రంగా ఇలాత లాన్ని పాలిస్తున్న జగన్నాటక సూత్రధారి.. గర్భా లయం వదిలి.. వీధుల్లోకి కదిలి వస్తాడు. ఎక్కడా లేని విశేషం పూరీలో ఒకటుంది. ఏ హిందూ ఆలయంలో అయినా.. ఊరేగింపు సేవకు మూలమూర్తిని కదిలిం చరు. ఊరూరా ఉత్సవ విగ్రహాలే ఊరేగుతాయి. పూరీలో మాత్రం మూలమూర్తి రథం ఎక్కుతాడు. ఊరంతా తిరుగుతాడు. పది రోజులు ఆలయాన్ని విడి చిపెడతాడు. బలభద్ర, సుభద్ర సమేతుడై రథయా త్రకు వేంచేసే జగన్నాథుడి మూలవిరాట్టు.. భక్తజన హృదయ సామ్రాట్టు.

పూరీ ఆలయంలో ఎన్నో విశేషాలు. ఇక్కడ స్వామి కొయ్యతో కొలువుదీరడం ఆశ్చర్యం. భక్తులను స్వయంగా వచ్చి అనుగ్రహించడం మరో అద్భుతం. పైగా సాధారణంగా ఏ ఆలయంలో అయినా ఊరే గింపు కోసం ప్రతి సంవత్సరం ఒకే రథాన్ని వినియోగి స్తుంటారు. కానీ, పూరీలో మాత్రం జగన్నాథుడి రథ

చక్రాలు మాత్రమే కాదు.. రథం కూడా ఏటా ప్రత్యే కంగా తయారవుతుంది. రథయాత్రకు రెండు నెలల ముందు నుంచే రథ నిర్మాణ క్రతువు మొదలవు తుంది. వైశాఖ బహుళ విదియ రోజు రథ నిర్మాణానికి పూరీ సంస్థానాధీశుడు ఆదేశాలు జారీ చేస్తాడు. అందుకు అవసరమైన వృక్షాలను 1072 ముక్కలుగా ఖండించి పూరీకి తరలిస్తారు. అక్షయ తృతీయనాడు రథ నిర్మాణ పని మొదలుపెడతారు. ఆషాఢ శుద్ధ పాడ్యమి నాటికి రథాలను సిద్ధం చేస్తారు. జగన్నా థుడి రథాన్ని నందిఘోష అంటారు. దీని ఎత్తు 45 అడుగులు. పదహారు చక్రాలు పూన్చిన జగన్నాథుడి రథాన్ని దర్శించుకున్న మాత్రాన పుణ్యం దక్కుతుం దని భక్తుల విశ్వాసం. ఆ రథాన్ని లాగే అవకాశం దొర కడం పూర్వజన్మ సుకృతంగా భావిస్తారు. ఇక బలభ ద్రుడి రథాన్ని తాళధ్వజం అంటారు. దీని ఎత్తు 44 అడుగులు, పద్నాలుగు చక్రాలు ఉంటాయి. సుభద్రా దేవి రథం పేరు పద్మ ధ్వజం. ఎత్తు 43 అడుగులు. చక్రాలు పన్నెండు. జగన్నాథుడి రథాన్ని పసుపు వస్త్రంతో అలంకరిస్తారు. బలభద్రుడి రథాన్ని ఎర్రటి చారలుండే నీలి వస్త్రంతో కప్పుతారు. పద్మధ్వజాన్ని ఎర్రటి చారలున్న నలుపు వస్త్రంతో అలంకరిస్తారు.

కన్నుల పండుగ పహండీ

విదియ నాడు ముందుగా ఆలయంలో ప్రత్యేక పూజలు చేస్తారు. తర్వాత విగ్రహాలను వారి వారి రథాలపై అధిరోహింపజేస్తారు. ఈ వేడుకను 'ప హండీ' అని పిలుస్తారు. తర్వాత పూరీ సంస్థానాధీ శులు రథం ఎక్కి స్వామి ముంగిట బంగారు చీపు రుతో శుభ్రం చేస్తారు. దీనిని 'చెరా పహారా' వేడుకగా చెబుతారు. తర్వాత పలు సంప్రదాయ క్రతువులు కొనసాగుతాయి. చివరిగా భక్తుల జయజయధ్వానాల మధ్య రథయాత్ర మొదలవుతుంది. 'జై జగన్నాథ.. జైజై జగన్నాథ..' అంటూ తాళ్లను పట్టుకుని రథాన్ని లాగడం మొదలుపెడతారు. దీన్నే ఘోషయాత్ర అంటారు. జగన్నాథ ఆలయం నుంచి మూడుమైళ్ల దూరంలో ఉన్న గుండీచా మందిరానికి రాత్రికి గానీ రథాలు చేరుకోవు. మూలమూర్తులను ఆ పూట రథంలోనే ఉంచుతారు. మర్నాడు మేళతాళాలలో గుడిలోకి తీసుకెళ్తారు. గుండీచా దేవి.. జగన్నాథుడి పిన్నిగా చెబుతారు. ఆ ఆల యంలో స్వామి వారం రోజులు ఆతిథ్యం స్వీకరి స్తారు. తర్వాత ఆషాఢ శుద్ధ దశమి నాడు పూరీకి తిరుగు ప్రయాణం అవుతాడు. దీనిని బహుదాయాత్ర అంటారు. దశమి నాటి మధ్యాహ్నానికి పూరీ ఆలయా నికి రథాలు చేరుకుంటాయి. రోజంతా ఆలయం వెలు పలే నిలిచి ఉంటాయి. తొలి ఏకాదశి నాడు స్వామివా ర్లను బంగారు ఆభరణాలతో అలకంరిస్తారు. ప్రత్యేక పూజలు చేస్తారు. ద్వాదశినాడు మళ్లీ విగ్రహాలను గర్భ గుడిలోని రత్న సింహాసనంపై ఉంచడంతో పూరీ రథ యాత్ర ముగుస్తుంది.

...✍ రామకీర్తన

ప్రేమపూర్వక స్పర్శ.. దివ్యౌషధం

ఇస్లాం బోధ

లుఖ్మానె హకీం సుప్రసిద్ధ వైద్యులు. ఆయన పేరుతో ఖురాన్‌లో ఒక అధ్యయమే ఉంది. వందల సంవత్సరాలపాటు ఎన్నో రోగాలకు చికిత్స చేశారు. అరుదైన వైద్యుడిగా గుర్తింపు పొందారు. 'మనిషి రోగానికి ప్రేమ, ఆదరణకు మించిన ఔషధం లేదనే విషయం తనకు బోధపడింద'ని ఆయన చెబుతుండే వారు. ఒకసారి లుఖ్మానె హకీంతో 'ఒకవేళ ఈ ఔష ధాలు కూడా పనిచేయకపోతేనో?' అని ప్రశ్నించారు. దానికి ఆయన చిన్నగా నవ్వి 'ప్రేమ పాళ్లు పెంచండి' అని బదులిచ్చారు. ప్రేమపూర్వకమైన స్పర్శను మించిన ఔషధం లేదంటారాయన. వైద్యుడు ప్రత్యక్ష దైవం. అందుకే వైద్యులకు, వైద్యానికి ఇస్లామ్ ధర్మం ఎనలేని ప్రాధాన్యాన్ని ఇచ్చింది. ఒక ప్రాణాన్ని కాపా డితే సమస్త మానవాళి ప్రాణాలు కాపాడటంతో సమా నమని ఖురాన్ పేర్కొన్నది. 'ఒకసారి దైవ ప్రవక్త ఇబ్రాహీం (అలై) దైవాన్ని 'ప్రభూ వ్యాధి ఎవరి తరపు నుంచి వస్తుంద'ని అడిగారు. అప్పుడు సృష్టికర్త తరపు నుంచి అని సెలవిచ్చాడు అల్లాహ్. మళ్లీ ఆయన 'మందు ఎవరి తరపు నుంచి?' అని ప్రశ్నించారు. 'మందు కూడా నా తరపు నుంచే'' అని సమాధానమిచ్చాడు దేవుడు. 'అలాంటప్పుడు వైద్యుని అవసరమేంటి?' అన్నారు ఇబ్రాహీం (అలైహి). 'వైద్యునితో ఔషధం ఇవ్వడం జరుగుతుంది' అని సెలవిచ్చాడు దైవం. వైద్యుడి గొప్పదనం అంతటిది. రోగులను వైద్యులు నవ్వుతూ పలకరించాలి. రోగి చెప్పింది పూర్తిగా వినాలి. అతనికి ధైర్యాన్ని నూరిపోయాలి. ప్రేమపూర్వక స్పర్శతో ఉపశమనం కలిగించాలి. దీంతో తనకు ఏం కాదన్న నమ్మకం రోగికి ఏర్పడుతుంది. రోగం సగం నయం అవుతుంది.

...✍ ముహమ్మద్ ముజాహిద్
96406 22076



జనార్దనుని కాళియ మర్దనం

శ్రీ శుకముని భూజాని పరీక్షిత్తుతో.. రాజా! గోపికలు యశోదని పట్టుకొని దుఃఖం ఆపుకోలేక, యశోదయా– అతులిత కీర్తి, కరుణా శోభితుడైన నంద సుతుని ఉద్దే శించి ఇలా అన్నారు..

నీ॥'ఎదురు వచ్చిన జాల నెదురుగా జనుదెంతు,
వెదురు వచ్చిన నేడదేల రావు?
చూచిన గృపతోడ జూచుచుందువు నీవు,
సూచిన గనువిచ్చి చూడవేల?
డాసిన నఱలేక డాయంగ వత్తువు,
డాసిన నేటికి డాయవిచట?
జీరిన నోయని చెలరేగి పలుకుదు,
విదియేమి నీరిన నెఱుగ కుంట?
ఆ॥ తలపు సేయు నంత దలపోయు చుందువు
తలపు సేయ నేడు దలప వకట!
యనుచు భక్తి వివశ లాడెది కైవడి
వ్రేత లెల్ల నాడి వివశలైరి'

'బాలగోపాలా! మేము ఎదురొస్తే నీవూ బదులుగా మాకు ఎదురొ చ్చేవాడివి. కాని ఈనాడు నీవలా రాకుంటివేల? మేము తిలకిస్తే నీవు పులకించి దయతో మమ్ము చూచేవాడివి. ఓ కన్నా! నేడు మేము కన్నార చూచినా, నీవు కనువిచ్చి మమ్ము కనవదేమి? మేము పొంతకు– దగ్గరకు వచ్చిన నీవూ మా చెంతకు చేరే వాడివి. ఇప్పుడు మేము వద్దకు వచ్చినా, ఓ ముద్దుల కృష్ణా! నీవు మా దరికి రావేమి? పిలవగానే 'ఓ' అని కులుకుతూ పలికేవాడివే! నేడు మేము నోరారా పిలుస్తున్నా ఓ చిత్తచోరా! దామోదరా! నీవు పలు కవేమి? స్మరించగానే స్ఫురణకు వచ్చే విరించి జనకా! ఈ వేళ మేము వలపు మీర తలచినా నీవు మా తలపు (మనసు)లోకి రావ దేల? అకటా!– అయ్యో! ఇదేమి వికటం– విరుద్ధం తండ్రీ!'... అని భక్తితో పరవశించిన వారివలె గోపికలు కదలికలు కోల్పోయి, వెన్నదొంగను వదలి వెనుదిరిగి పోలేకపోయారు. మూలంలోని 'త త్సౌహృద స్మిత విలోక గిరః స్మరంత్యాः'– (గోపికలు నిత్యం, నిరం తరం బాలకృష్ణుని సౌహార్దం– ఉదారమైన చెలిమి, అందమైన మందహాసం, చనువుతో కూడిన చూపులు, మధురమైన మాటలనే స్మరిస్తుంటారు) అన్న ఈ శ్లోక పాదాన్ని గ్రహించి సుశ్లోకుడు పోతన కరుణ, వాత్సల్య రసాలను భక్తితో రంగరించి, సరసోక్తు లతో పై సీసాన్ని సింగారించాడు.

'మడుగులో పడి మనమూ ప్రాణాలు విడుద్దాం' అంటూ వడిగా అందులో పడబోతున్న యశోదాదులను చూచి బలభద్రుడు 'తల్లి దండ్రులారా! ముందు చూడబోయే కనువిందు జాడ (తీరు) తెలి యక మీరిలా కుందు (దుఃఖపడు)తున్నారు. సందేహించక ఓర్పు వహించి తుది తీర్పు వరకు వేచి చూడండి' అంటూ కరివేలుపు (కృష్ణుని) బలమెరిగిన నేరి– హలధరుడు తనవారినందరిని వారిం చాడు. వారిజనేత్రుడు కృష్ణుడు కూడా మానవమాత్రుని వలె ఒక ముహూర్త కాలం మౌనం వహించి ఊరకున్నాడు. నాగారి వాహ నుడు సరదాగా అలా కొంతసేపు నాగరాజు వేషాలను బాగా సాగ నిచ్చాడు. అంతలోనే తేరుకున్న వానివలె కన్నయ్య ఉన్నట్టుండి తన మేను ఒక్కమారుగా బాగా పెంచాడు. స్వామి బలానికి తాళ లేక కాళియుని ఒడలు (శరీరం) కుమిలిపోయి, మట్టలు పట్టు వదలి వీడిపోయాయి. పడగలు వేడెక్కి అవయవాలు సడలిపో యాయి. వాడు కరవడం మాని ఆయాసపడుతూ, నిడుపైన (దీర్ఘ) నిట్టూర్పులు విడుస్తూ తలలు నెమ్మదిగా పైకెత్తాడు. ముక్కు రంధ్రాల నుండి నెత్తురు చిమ్ముతుండగా వగ (బాధ)తో దిక్కులు చూస్తూ పొగమూరిన కట్టెవలె తురగలి (తేజస్సు) కోల్పోయి, ఉరగ (సర్ప)రాజు కాళియుడు హరిని వీడి దూరంగా జరిగిపోయాడు. అరవిందాక్షుడు గరుడధ్వజుడు తన చేతితో కాళియుని పడగలపై ఎడాపెడా వడి–వడిగా చరచాడు. ఖగేంద్రు(గరుడు)ని వలె వ్రజేంద్ర చంద్రుడు కృష్ణుడు దుష్ట నాగేంద్రుని దవడల మీద గట్టిగా ఒడిసిపట్టి, వానిని పైకెత్తి గిరగిర తిప్పి పిసిరికొట్టాడు. ఆ దెబ్బతో కాళియుని కళ్ల నుండి విషాగ్ని జ్వాలలు వెల్లువలై పెల్లుబి కాయి. ఆ క్రూరసర్పంలోని దర్పం సర్వం కర్పూరంలా హరించు కుపోయింది. నాగారి (గరుడ) వాహనుడు శౌరి– జగజెట్టి నంద పట్టి రెట్టించిన ఉత్సాహంతో ఉరగరాజు– కాళియునిపై విజృం భించి వీరంగం వేశాడు.

వ్యాస భాగవతంలో 'అఖిల కలాది గురుర్న ర్త' (అన్ని విద్యలకు, కళలకు ఆదిగురువైన శ్రీధరుడు కృష్ణుడు నాట్యమాడాడు) అని దిజ్మాత్రంగా ఉన్న– ''కాళియుని ఉత్తమాంగా (శిరస్సు)ల రంగస్థలంపై అనంగజనకుడు, 'చతుర నటమూర్తి గోపాల చక్రవర్తి' అయిన శ్రీకృష్ణుడు సలిపిన నృత్య విలాసాన్ని'' ఈ సీస పద్యంలో నిత్య నూతనంగా, సొంగ రూపక అలంకారంలో అంగరంగవైభ వంగా రసవత్తరంగా అభివర్ణించాడు మన భక్తకవి పుంగవుడు పోతన!

సీ॥'ఘన యమునా నదీ కల్లోల ఘోషంబు,
సరస మృదంగ ఘోషంబు గాగ
సాధు బృందావన చర చంచలీక గా,
నంబు గాయక సుగానంబు గాగ
గలహంస సారస కమనీయ మంజు శ,
బ్దంబులు దాశ శబ్దములు గాగ
దివి నుండి వీక్షించు దివిజ గంధర్వాది,
జనులు సభాసీన జనులు గాగ
తే॥ బద్మ రాగాది రత్న ప్రభాసమాన
మహిత కాళియ ఫణిఫణా మండపమున
నళినలోచన విఖ్యాత నర్తకుండు
నిత్య నైపుణమున బేర్చి నృత్యమాడె'

శుకుడు.. రాజా! పద్మరాగాది రత్న ప్రభలతో భాసించే కాళియుని పడగలే విశాలమైన మంటపం– వేదిక. ఇంపైన కాళిందీ నదిలో కదిలే తరంగాల ధ్వనులే వినసొంపైన మృదంగ ధ్వానా (శబ్దా) లుగా ఆద్య నాట్యాచార్యునికి వాద్య సహకారం అందిస్తున్నాయి. బృందావనంలో ఆనందంగా సంచరించే చంచరీక (తుమ్మెద) బృందాల మధుర ఝంకార నాదాలే గాయక గంధర్వుల మోదభ రిత గానం కాగా; కలహంసల, సారసా (బెగ్గురు పక్షు)ల కలకూజి తాలే– శ్రావ్యమైన శబ్దాలే తాళ ధ్వనులై అలరించగా; దివి నుండి వేడుకగా వీక్షిస్తున్న యక్ష గంధర్వాది దేవతలు నర్తనశాలలో వర్త మానులై ఉన్న ప్రేక్షక సత్తములు కాగా; ధర్మ (కపట) బాలకుడు, పద్మాక్షుడు కృష్ణుడు అనే ప్రఖ్యాత నర్తకుడు కాళియ ఫణా(పడగ)లనే విశాల సద్మం– భవనంలో నిత్యమైన నైపుణ్యంతో నృత్యమా డాడు. అందెలు గజ్జెలు మ్రోయగ నందనందనుడు లీలా విలాస గతులతో లయబద్ధంగా కాళియ పడగలపై ఎడపెడ వడివడిగా చిందులు తొక్కాడు. ప్రళయంకరంగా ప్రచండ నృత్యకాండ సలిపి 'తాండవ' కృష్ణుడయ్యాడు! 'దిక్పటధరుడు– దిగంబరుడు హరుడు నటరాజే, వటపత్రశాయి నగధరుడు పీతాంబరుడు నటవ రుడు హరి' అని ఇచ్చట ముచ్చటగా నిరూపించాడు కరివేలుపు కృష్ణుడు! ఇది గాంచి పరవశించి సురులు, మునులు తమ భార్య లతో కూడి విరుల వానలు కురిపించారు.

కాళియుడు ముఖాల నుంచి రక్తమాంసాలు వెళ్లగక్కాడు. అతని కళ్ల నుంచి విషం పెల్లుబికింది. ప్రాణాలు గొంతు వరకు వెళ్లుకుని వచ్చాయి. శక్తి సన్నగిల్లి నీరసించి పోయాడు. తల ప్రాణం తోకకు రాగా విలవిలలాడి పోతూ కాళియుడు తనలో ఇలా తలపోశాడు... 'ఆహా! ఇది కలా లేక కల్లా?' నా విషమనే పావక (అగ్ని) జ్వాలలు సోకితే చాలు, నాక సదులు (దేవతలు) కూడా చావక మానరే! అయ్యో! ఇదేమి చోద్యం? ఈ బాలశౌరి నా శిరశ్శతకాన్ని (నూరు పడగలను) చితక తొక్కుతూ అతల కుతలం చేస్తున్నాడు. చూడగా ఇతడు సామాన్యుడుగా కానరావడం లేదు. సకల చరాచర ప్రాణి వర్గానికి ప్రభువైన ఆ పరమేశ్వరుడే! హరి సేవాప్రీతుడు– భక్తితో సేవిస్తే ప్రసన్నుడవుతాడు' అని ప్రాణభీతితో అంతఃకరణంలో భరణ– న్యాసం (రక్షణ భారాన్ని ఆ భగవంతునికే వదలి) చేసి తక్షణం శరణాగతుడయ్యాడు.

శుకుడు– రాజా! కాళియుని భార్యలు– నాగకాంతలు దిక్కు తెలి యక భ్రాంతికి లోనై తత్తరపడుతూ వచ్చి, శ్రాంతుడై– చితికి పోయి, చచ్చినట్లు పడి ఉన్న తమ భర్తను చూచి బిత్తరపోయి, మిక్కిలి నొచ్చుకొని, బావురుమని ఏడుస్తున్న వేవురు (పలువురు) బిడ్డలను ముందుపెట్టుకొని, కృష్ణ చందురునికి వందనాలు అర్పించి, అంజలిగావించి, కృద్ధుడై ఉన్న అనిరుద్ధ భగవానుడు తమ పతికి విధించిన శిక్షను– 'అధోక్షజా! ఇది నీ కక్షపూరితం కాదు' అని ఆమోదిస్తూ, శ్రద్ధా భక్తులతో తమ సౌభాగ్య సమృ ద్ధిని కాంక్షిస్తూ భక్తితో ఇలా జాలిగా నుతించారు... సుగుణ నిధీ! క్రూరులను దండించడానికి అవనిపై అవతరించిన మహానుభా వుడవు నీవు! క్రూరుడైన ఈ కాళి యుని శిక్షించడం నీకు వీరత్వమే కాని క్రూరత్వం కాదు. అజాత శత్రువువైన నీకు దుష్ట శిక్షణం లోక రక్షణమే కదా!

తంగిరాల
రాజేంద్రప్రసాద శర్మ
98668 36006

క॥'నిగ్రహమె మము విషాస్యుల
నుగ్రుల శిక్షించుటెల్ల? నూహింప మహా
నుగ్రహము గాక మా కీ
నిగ్రహము విషాస్యభావ నిర్గతి జేసెన్'...

'స్వామీ! మేము గళం–కోరలలో ఘోరమైన గరళం (విషం) కల వారం. క్రూరమైన కోపం కల పాప (సర్ప)జాతి వారం. మావంటి వారిని శిక్షించడం మండనమే (అలంకారమే) కాని దండన అని పించుకోదు. కారణం? దీనివలన విషం కలవారమని ఎగిరెగిరి పడే మా పొగరు, పగ శాశ్వతంగా ఇగిరిపోయాయి. ధర్మ విగ్రహా! ఈ నీ నిగ్రహం– శిక్ష, దండనం మా యెడల మహా అనుగ్రహమే!'

ఉ॥'ఎట్టి తపంబు సేసెనొకొ? యెట్టి సుకర్మము లాచరించెనో?
యెట్టి నిజంబు పల్కెనొకొ? యీ ఫణి పూర్వ భవంబునందు ము
న్నెట్టి మహానుభావులకు నెన్నడు జేరువగాని నీవు నే
డిట్టి వినోద లీల దలకెక్కి నటించెదవీ ఫణీంద్రుపై'

'పురుషోత్తమా! ఈ కాళియుడు పూర్వజన్మల్లో ఎటువంటి తప స్సులు చేశాడో? ఎలాంటి సత్కార్యాలు చేశాడో? ఎన్ని నిజాలు పలికాడో? ఎంతటి మహానుభావులకు కూడా ఏనాడూ దరిచేరని ఓ హరీ! నీవు ఈ భోగిరాజు పడగలపై వినోదంగా నాట్యం చేశా వంటే అది ఎంతటి భాగ్యమో కదా!'

(సశేషం)

కథాసుధ

పడవ ప్రయాణం

ఓ పండితుడు ఆధ్యాత్మిక ఉపన్యాసం ఇవ్వడానికి బయలుదేరాడు. తను వెళ్లాల్సిన ఊరు చేరాలంటే నది దాటవలసి ఉంటుంది. అందుకని పడవ ఎక్కాడు. పడవను నడిపే వ్యక్తి ఆసక్తిగా 'జీవితం అంటే ఏమిటి?' అని పండి తుణ్ని అడిగాడు. 'నదీ ప్రయాణం లాంటిదే జీవితం. బయలుదేరిన పడ వలో ఎంతోమంది ఎక్కుతారు. కలుసు కుంటారు. ఒకర్ని ఒకరు చూసుకుంటారు. ఒకరి గురించి ఒకరు తెలుసుకుంటారు. ఎన్నెన్నో మాట్లాడుకుంటారు. వారు దిగా ల్సిన ఒడ్డు వచ్చాక దిగి తలో దిక్కుకు వెళ్లి పోతారు. మరో ఒడ్డులో మరికొందరు ఎక్కుతారు. వాళ్లూ పడవలో ప్రయాణం చేస్తారు. వారి గమ్యం వచ్చాక వారు కూడా దిగి వెళ్లిపోతారు. మనం కూడా మన గమ్యం వచ్చేంతవరకు మాత్రమే ప్రయాణం సాగిస్తాం. ఈ పడవ ప్రయా ణంలాగే మన జీవితంలో కూడా అదే జరుగుతుంది. ఈ భూమి మీదికి వచ్చాక మన జీవితంలోకి ఎంతోమంది తొంగి చూస్తారు. మనతోపాటు ప్రయాణం చేస్తారు. వారి గమ్యం వచ్చాక మనల్ని వీడిపోతారు. అలా వెళ్లేటప్పుడు వెళ్లిపోతామని కూడా చెప్పరు, చెప్పడానికి కూడా వారికి కుదరదు. మనం కూడా అంతే. చెప్పాపెట్టకుండా ప్రయాణం ముగిస్తాం. ఇక్కడ మనం గుర్తించాల్సింది ఏమిటంటే ఈ పడవ ప్రయాణం తాత్కాలికమని గ్రహించాలి. ఈ భూమి మీదికి అతిథుల్లా వచ్చాం, అతి థుల్లా ఉంటాం, అలాగే వెళ్లిపోతాం. మన జీవిత ప్రయాణంలో ఎదురయ్యే వారు, వారితో అనుబంధాలు... శాశ్వతమని భావిస్తేనే సమస్య. అంతేకా కుండా ఈ సృష్టిలో అందరూ సమానమే అని గుర్తించాలి . ప్రశాంతంగా ప్రవహించే ఈ నదిలో హఠాత్తుగా సుడిగుం డాలు వస్తే అందరం మునిగిపోతాం. చిన్నా పెద్దా, పేదా ధనిక, కులం, మతం తేడా ఉండదు. ఎందుకంటే సృష్టిలో విభజన లేదు. మనిషే విభజనను తయారుచేశాడు. అందరూ మనవారే అనుకుంటే జీవితం మధురం, విభజన చేసి చూస్తే భయంకర మైన విషం. అందుకే అన్ని జీవరాశులపట్ల ప్రేమను ప్రదర్శించాలి. అది గొంతు నుంచి కాదు, హృదయం నుంచి రావాలి' అని వివరించాడు.

...✍ ఆర్సీ కృష్ణస్వామి రాజు,
93936 62821

ఉపనిషత్ వాక్యం

విభూతి.. అపర సంజీవని

భస్మ పాపం నికృంతయేన్మోక్షం దదా తీతి భగవాన్ కాలాగ్ని రుద్రः...
(బృహజ్జాబాల ఉపనిషత్తు తృతీయం బ్రాహ్మణం– 38)

విభూతి పాపాన్ని పోగొట్టి మోక్షం ఇస్తుందని కాలాగ్నిరుద్రుడు భుసుండునికి వివరించాడు.

పాపం నాశయతే కృత్స్నమపి జన్మాంతరార్జితం
(చతుర్థం బ్రాహ్మణం– 32)

జన్మజన్మలుగా పేరుకుపోయిన పాపాన్ని సైతం విభూతి పూర్తిగా నశింపజేస్తుందని శ్లోక భావం. అంతే కాకుండా నిష్ఠగల వారికి భస్మం ప్రాణదానం చేసే సంజీవనిలా గాను పనిచేస్తుందని ఈ ఉపనిషత్తు ప్రతిపాదిస్తున్నది. వశిష్ఠుని వంశంలోని ధనంజయుడనే బ్రాహ్మణునికి నూరుగురు భార్యలు. పెద్దభార్య కొడుకు కరుణుడు. అతని భార్య శుచిస్మిత. అతను అన్నదమ్ముల వైరం కారణంగా.. భవానీ తీరంలోని నరసింహుడి దగ్గరికి వెళ్లాడు. అక్కడ ఇంకెవరో నైవేద్యంగా సమర్పించిన నిమ్మపండు వాసన చూశాడు. అక్కడి వారు కోపంతో నూరేండ్లు అడవి ఈగవై పొమ్మని కరుణుణ్ని శపించారు. అతను భార్యతో తనను రక్షించు మన్నాడు. అంతలోనే ఈగగా మారిపోయాడు. దాయాదులు అతణ్ని నూనెలో పారవేసి చంపేశారు. శుచిస్మిత భర్త మృతదేహంతో అరుంధతి దగ్గరికి వెళ్లింది. ఆమె మృత్యుంజయ మంత్రంతో అభిమంత్రించి భస్మాన్ని ఈగ మీద చల్లింది. అది బతికింది. తర్వాత వందేండ్లు నిండాక ఒకడు ఆ ఈగను చంపడంతో శాపం తీరింది. మరో సందర్భంలో శ్రీహరి.. శివుడి వక్షస్థలంలోని భస్మాన్ని ప్రణవంతోనూ, గాయత్రితోనూ, పంచాక్షరితోనూ అభిమంత్రించి తన శరీరానికి అల దుకొన్నాడు. శివుణ్ని ధ్యానించాడు. శివుడు దర్శనమిచ్చి విభూతిని భక్షించమని కోరగా హరి అలాగే చేశాడు. క్షణంలో శివుని ప్రతిబింబంలా తెల్లని కాంతితో శ్రీహరి వెలిగిపోయాడు. నాటి నుంచి తెల్లని కాంతి కలవాడుగా మారాడు. 'భస్మ ప్రభావమే ఎరుగను. నీ ప్రభావం ఎలా తెలియగలను?' అని మహావిష్ణువు.. పరమశి వుణ్ని కొనియాడాడు. భస్మధారణ ప్రభావం అటువం టిదని పై రెండు ఉదంతాలు తెలియజేస్తున్నాయి. ఇదే బృహజ్జాబాల ఉపనిషత్తులో భస్మధారణ చేసిన వాడు తన భక్తుడు అవుతాడని శివుడు పేర్కొన్నట్టుగా ఉంది.

...✍ డా॥ వెలుదండ సత్యనారాయణ